క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఎన్టీటీపీఎస్ ప్రధాన గేటు వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షంషేర్‌వలి మాట్లాడుతూ కార్మికుల 2022 సంవత్సరం పీఆర్సీ, 16 నెలల ఎరియర్స్ తక్షణం విడుదల చేయాలని, గ్రేడ్లు మార్పుచేసి తొలగించిన ఇన్సెంటివ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రీజినల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, తంబికుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

క్రీడల్లో జెడ్పీ బాలికల ప్రతిభ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మైలవరం నియోజకవర్గం స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో మూలపాడు జెడ్పీ పాఠశాల బాలికలు ఉత్తమ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి పాఠశాలలో శుక్రవారం జరిగిన అండర్ 14 విభాగం యోగా పోటీల్లో జె.దుర్గాభవానీ, బి. ప్రియాంక ప్రథమ, ద్వితీయ స్థానాలు, అండర్ 17 షటిల్ పోటీల్లో వి.మేఘన ప్రథమ, ఎస్.జస్వంతి ద్వితీయ స్థానాలు, అండర్ 17 కబడ్డీలో శ్రీవల్లి, స్వాతి, అక్షిత ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికలను హెచ్‌ఎం డేవిడ్ ఫెల్లర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఉరుసు



ఎ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో మూడు రోజులుగా జరుగుతున్న మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా ఉరుసు ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. దర్బార్ పీఠాధిపతి సజ్జదా నషీన్ ఫీర్జాదా మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్‌బాబు, జాఫర్ షరీఫ్ తాజ్ ఖాదర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వశాంతిని కోరుతూ మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం గంధం ఉత్సవం కనులపండువగా జరిగింది. శుక్రవారం వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో సునీత శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటుపల్లి, దాములూరు, చిలుకూరు, కాచవరం, కేతనకొండ, ఈలప్రోలు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు జర్నల్స్ ఉపయోగం

మైలవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జర్నల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల విద్య కమిషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో యంగ్ ఇంటలెక్చువల్, ఈ జర్నల్‌ను మంగళగిరిలోని విద్య కమిషనర్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారన్నారు. ఈ జర్నల్ ప్రత్యేక సంచికతో పాటు వెబ్ సైట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్, జర్నల్ చీఫ్ ఎడిటర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల్లో పరిశోధన పద్ధతులు అలవాటు చేయడం, వారిలో కలిగే సందేహాలను సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ ద్వారా నివృత్తి చేయడం జర్నల్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, యశ్వంత్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఆగిరిపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ అన్నారు. తోటపల్లిలోని హీల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మండల స్థాయి చెకుముకి పోటీల్లో ప్రథమస్థానం సాధించడంతో హీల్ పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ సాయిబాబు, అథ్లెటిక్స్ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

గంపలగూడెం: మండలంలోని నాలుగు గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 4,762 జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. నెమలి, ఉమ్మడ దేవరపల్లి గ్రామాల్లో 1,011 గొర్రెలకు, 299 మేకలకు, కనుమూరులో 1,640 గొర్రెలకు, 346 మేకలకు, ఊటుకూరులో 1,122 గొర్రెలు, 342 మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశామని పశు వైద్యాధికారులు అభిలాష్, సాయికృష్ణ, శిరీష తెలిపారు. ఎల్ఎస్ ఎ. చిన్నప్ప, ఏహెచ్‌ఎంలు పాల్గొన్నారు.

- చినుకుపడితే బురదమయంగా రహదారి
- జారిపడుతున్న వాహన చోదకులు
- అడుగుతీసి అడుగు వేయలేక ఇబ్బందులు
- లంక గ్రామాలకు రహదారి కష్టాలు

పెదలంక గ్రామ సమీపంలో బురదమయంగా మారిన రోడ్డుపై వాహన చోదకుడి పాట్లు



ఈ రోడ్డుపై సర్కస్ ఫీట్లు తప్పదు!

ఇబ్రహీంపట్నం: చినలంక, పెదలంక గ్రామాల ప్రజలకు సరైన రోడ్డుమార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలుగా వ్యవసాయాన్ని నమ్ముకుని అరకొర సౌకర్యాల మధ్య వీరు జీవిస్తున్నారు. ఏ అవసరం వచ్చినా జూపూడి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారికి వచ్చి ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు వెళతారు. ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో అర్ధరాత్రి అనారోగ్యానికి గురైతే బైకులపై వైద్యశాలలకు తీసుకువెళ్లాల్సి ఉంది. హైవే నుంచి లంక గ్రామాలు సుమారు ఐదు కిలో మీటర్ల దూరం ఉండగా ఒక కిలో మీటరు దూరం బీటీ రోడ్డు గతంలో వేశారు. మిగిలిన నాలుగు కిలో మీటర్లు మట్టి రోడ్డుపై ప్రయాణం చేయాలి. వర్షాకాలంలో గుంతల మయంగా మారిన రోడ్లపై సర్కస్ ఫీట్లు చేయక తప్పడం లేదు. ఇసుక, ఒండ్రు మట్టి కలిసి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై జారిపడి గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి.



ఇటీవల వచ్చిన వరదలకు జూపూడి చినలంక వద్ద సప్టాపై తేలిన బండరాళ్లపై ప్రయాణిస్తున్న లంక ప్రజలు (ఫైల్)

వర్షం పడితే నరకయాతన..

చినలంక, పెదలంక గ్రామాల ప్రజలు ఇబ్రహీంపట్నానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే కొద్దిపాటి కృష్ణానది పాయ వద్ద సప్టా దాటుకుని రావాలి. ఈ పాయలోనే ఏనుగుగడ్డ వాగు, ఉబ్బడివాగు, మునేరు వరదనీరు అప్పుడప్పుడు వచ్చి చేరుతోంది. ఏడాదిలో నాలుగైదుసార్లు లంక గ్రామాలకు వరద తాకిడి వస్తుంది. వరద వచ్చిన ప్రతి సారీ సప్టా వద్ద మట్టి కోతకు గురై వారం రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతాయి. కొద్దిపాటి వర్షం పడినా రహదారి చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. ఈ గ్రామాలకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రతి ఒక్కరూ బైకులు, ట్రాక్టర్ల ద్వారా ఇతర గ్రామాలకు చేరుకోవాల్సి ఉంది. ఇటీవలి కాలంలో ప్రజలే రోడ్డుకు కొద్దిపాటి మరమ్మతులు చేసుకున్నారు.

ఇవి రెండు జిల్లాల సరిహద్దు గ్రామాలు

చినలంక, పెదలంక గ్రామాలు కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దు గ్రామాలుగా ఉన్నాయి. దీనివల్లే అధికారుల తమను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని జూపూడి గ్రామ పరిధిలో చినలంక ఉండగా.. గుంటూరు జిల్లా రాయపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పెదలంక ఉంది. దీంతో లంక ప్రజల దైనందిన జీవితం అంతా కృష్ణా జిల్లాతో ముడిపడి ఉంది. రెండు గ్రామాల ప్రజలు ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ ఫలితం లేదు. లంక గ్రామాల రోడ్డు కృష్ణానది పరీవాహక ప్రాంతమని, గుంటూరు జిల్లా పరిధిలో ఉందని చెప్పడం పరిపాటిగా మారింది. సరిహద్దులు ఎలా ఉన్నా కనీసం ప్రజల సౌకర్యార్థం రోడ్డు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు అయినా అభివృద్ధి చేయండి



నాలుగు తరాలుగా మా కుటుంబం పెదలంక గ్రామంలో ఉంటోంది. నా చిన్నతనం నుంచి ప్రధాన రోడ్డు అభివృద్ధి చేయలేదు. లంకల్లో కరెంటు, విద్యార్థులకు పాఠశాల సదుపాయం తప్ప మౌలిక సదుపాయాలు లేవు. చుట్టూ పంట పొలాలు, విష పురుగుల మధ్య పిల్లలతో జీవిస్తున్నాం. కనీసం రోడ్డు అయినా అభివృద్ధి చేయాలి.

– దాసరి వీరబాబు, పెదలంక గ్రామం

ప్రతి ఏటా వరదలతో సహవాసం

లంక గ్రామాల ప్రజలు సుమారు 1,500 ఎకరాల లంక భూముల్లో అరటి, చెరకు, మొక్కజొన్న, పసుపు, మిర్చి, మినుము, వివిధ రకాల కూరగాయ పంటలు పండిస్తారు. ప్రతి ఏడాది వచ్చే వరదలతో వారు సహవాసం చేస్తారు. వరదలు వస్తే పంట పొలాలు, పాడి గేదెలు, జీవాలు, ఇళ్లు, ఇంట్లో సామగ్రి వదిలి సహాయక శిబిరాలకు వెళ్లాలంటే ఇష్టపడరు. ఇటీవలి కాలంలో వచ్చిన భారీ వరద ప్రవాహానికి అధికారుల ఒత్తిడితో కట్టుబట్టలతో సహాయక శిబిరాలకు చేరారు. పంటలు, పాడి గేదెలు, ఇళ్లల్లో సామగ్రి నష్టపోయారు. గతంలో చెరకు సాగు చేపట్టిన రైతులు ప్రతి ఏడాది డిసెంబర్‌లో చెరకు నరికి ఫ్యాక్టరీకి తరలించేవారు. చెరకులోడు లారీల రాకపోకలకు వీలుగా అప్పట్లో రోడ్డు అభివృద్ధి చేసుకునేవారు. ఐదారేళ్లుగా చెరకు సాగు అనూహ్యంగా తగ్గిపోవడంతో రహదారి అభివృద్ధి చేసేవారు కనిపించడం లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికి రైతులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎంపీడీఓను కలిసిన ప్రజాప్రతినిధులు



ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సునీతశర్మను వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తమ గ్రామాల అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడాలని వారు కోరారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఎం.రంగస్వామి, సువర్ణరాజు, యు.నాగేశ్వరరావు, సర్పంచులు డి.రాజేంద్ర ప్రసాద్, భుక్యా కవిత, బాణావత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో డీపీఆర్టీయూ మండల అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జయశ్రీ, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, షేక్ బాజీ ఎంపీడీఓను అభినందించారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి

డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

చాట్రాయి: ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను కోరారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యా వ్యవస్థను కాపాడేందుకు డీపీఆర్టీయూ పని చేస్తోందని చెప్పారు. 117 జీఓ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల పని ఒత్తిడి వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌వీ శోభన్‌బాబు, ఉపాధ్యాయులు ఆర్. నాగేశ్వరరావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలపై ఆగ్రహం

- పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు
- విద్యుత్ చార్జీలు పెంచితే గుణపాఠం తప్పదని హెచ్చరిక

మైలవరం: విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రూఅప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మైలవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు అధికారం చేపట్టిన అనంతరం నేడు కరెంట్ చార్జీలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం రూ. 8,114 కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపుతోందని చెప్పారు. దీనిని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోట కల్యాణ్, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు ఆలేటి విఠల్‌రావు, బేబీ సరోజిని, కామేశ్వరరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **ఎ.కొండూరు:** కంభంపాడు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడవక ముందే చార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. సీపీఎం నాయకులు పి. ఆనందరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు అరికట్టాలని, ఉచిత ఇసుక ఇవ్వాలని, రైతు భరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.
- **తిరువూరు:** తిరువూరు బోస్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకుడు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పెంచిన చార్జీలు తగ్గించడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, బి. వెంకటేశ్వరరావు, ఎస్‌వీ భద్రం తదితరులు పాల్గొన్నారు.
- **విస్సన్నపేట:** సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలు భారాలు మోపడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, నాయకులు జి. రామకృష్ణ, కిశోర్, ఏడుకొండలు, అప్పారావు, జి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



ఇబ్రహీంపట్నంలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



కంభంపాడులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



విస్సన్నపేటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ఇసుక సరఫరా చేయాలని డిమాండ్

తిరువూరు: గత మూడు నెలలుగా ఇసుక సరఫరా లేక భవన నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఇసుక సరఫరా చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్డీఓ మాధురికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణంతో పాటు 18 రకాల అనుబంధ రంగాల కార్మికులు పనులు లేక పూట గడవడం కష్టంగా మారిందన్నారు. ఇసుక ధరలు సైతం విపరీతంగా పెరగడంతో నిర్మాణాలు నిలిచిపోయాయని చెప్పారు. వెంటనే ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్‌కే సుబానీ, పాలకుర్తి సునీల్, ఎస్‌కే యాకూబ్ పాల్గొన్నారు.



తిరువూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మునగ ఆకుతో బహుళ ప్రయోజనాలు

నూజివీడు: మునగాకులో అనేక పోషక పదార్థాలుంటాయని, కూరల్లో, ఇతర ఆహార పదార్థాల్లో, పొడుల రూపంలో మునగాకును ఉపయోగిస్తే ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ఎస్‌వై నూరాని అన్నారు. పట్టణంలోని అజరయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

- **అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం):** మునగాకును ఆహారంలో తీసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని అమ్మిరెడ్డిగూడెం అంగన్‌వాడీ కార్యకర్త ఉష అన్నారు. అమ్మిరెడ్డిగూడెంలో 87వ అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మునగాకు తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయట పడవచ్చన్నారు. ఇతర ప్రయోజనాలను వివరించారు. రోజువారీ కూరల్లో మునగాకు పొడి వేసుకోవచ్చని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు చెట్టును నాటారు.



మునగాకుతో వంట తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న నూరాని

ఆరోగ్యానికి ఉపయోగం

ఆగిరిపల్లి: మునగాకు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని ఐసీడీఎస్ సీడీపీఓ నూరాని అన్నారు. మండల పరిధి బొద్దనపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు, తల్లులకు మునగాకు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మునగాకులో అనేక పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. మునగాకు తినటం వల్ల గర్భిణులు, బాలింతలలోని రక్తహీనత నివారణకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి



పర్వతాపురం సభలో తమ వాదనలు వినిపిస్తున్న రైతులు



సూరేపల్లిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ వాణి

ముసునూరు: భూముల రీ సర్వేలో వచ్చిన వివిధ సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని నూజివీడు ఆర్డీఓ ఎం.వాణి సూచించారు. మండలంలోని సూరేపల్లిలో రీ సర్వే అనంతర భూ సమస్యల పరిష్కార గ్రామ సభను శుక్రవారం సర్పంచ్ సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు, భూ యజమానులంతా తమ సమస్యలను గ్రామ సభలో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. సూరేపల్లిలో రీ సర్వే అనంతరం భూముల సర్వే నంబర్ల సబ్ డివిజన్లు, పాస్ పుస్తకాలు తదితర సమస్యల పరిష్కారం కోసం 33 అర్జీలు అందాయని తహసీల్దార్ పురుషోత్తమశర్మ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రంగారావు, ఆర్ఐ దీపిక, వీఆర్వో హరిబాబు పాల్గొన్నారు.

రసాభాసగా రెవెన్యూ గ్రామ సభ

చాట్రాయి: పర్వతాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ రసాభాసగా మారింది. గ్రామానికి చెందిన చీపు సత్యవతి, చీపు మల్లయ్య తదితరుల మధ్య భూ వివాదంపై వాగ్వివాదం కొనసాగింది. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం భూములను రీ సర్వే చేసి సమస్యలు పరిష్కరిస్తోందని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. భూ సమస్యలకు సంబంధించి 15 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మిద్దె శివాజీ, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: దెందులూరు మండలం దోసపాడుకు చెందిన పైడిమాల ప్రేమ్‌కుమార్ (26)కు కాట్రేనిపాడుకు చెందిన మాధురితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. ఈనెల 12న భార్యాభర్తలిద్దరూ కలిసి కాట్రేనిపాడులోని ఆమె పుట్టింటికి వెళ్లారు. రెండు రోజులు గడిపిన తర్వాత ఈ నెల 14న సోమవారం మధ్యాహ్నం ప్రేమ్‌కుమార్ దోసపాడు వెళతానని భార్యకు చెప్పి బయలుదేరాడు. వెళ్లిన వ్యక్తి ఇప్పటి వరకూ తిరిగి రాకపోవడంతో మాధురి తన భర్త కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో ఆమె ముసునూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నూజివీడు: విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్ ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విత్తన కంపెనీలు తమ ఆర్గనైజర్ల ద్వారా రైతులకు మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి రైతులతో సాగు చేయిస్తున్నారన్నారు. అధిక దిగుబడులు వస్తాయని ఆశ చూపుతున్నారని, సాగు తరువాత దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అగ్రిమెంట్లు ఇవ్వని కారణంగా రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. అగ్రిమెంట్‌తోపాటు వడ్డీలేని పంట రుణాలను, రాయితీపై ఎరువులు, పురుగు మందులను అందించాలని, ఈ పంట నమోదులో సీడ్ మొక్కజొన్నను పంటగానే నమోదు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ సి. ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. విత్తన సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: వెంకటాయపాలెం, హనుమంతులగూడెం, అన్నవరం, నర్సపేట, వెంకటాద్రిపురం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతు బజార్‌లో స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక రైతుబజార్‌లో ఖాళీ దుకాణాలను డ్వాక్రా గ్రూపుల మహిళలకు కేటాయిస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని రైతు బజారు ఈఓ చిట్టిబాబు తెలిపారు. పది దుకాణాలను కేటాయిస్తామన్నారు. ఆసక్తిగలవారు వారం రోజుల్లోగా ఎస్టేట్ ఆఫీసర్, రైతుబజార్, తిరువూరు చిరునామాకు దరఖాస్తులు పంపాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఆగిరిపల్లి: ఈదర జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి అభిలాష్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం శారద తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విజయవాడలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అభిలాష్‌ను హెచ్‌ఎంతోపాటు పీఈటీ ప్రమీలారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

- **ముసునూరు:** రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తమ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని గుడిపాడు హైస్కూల్ హెచ్‌ఎం నిర్మలాదేవి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో బాలికల విభాగంలో సరిదే ఝాన్సీ, శ్రావణి ప్రతిభ చూపి, ఉమ్మడి కృష్ణా జిల్లా వాలీబాల్ తుది జట్టులో స్థానం సాధించారని చెప్పారు. ఎంపికైన విద్యార్థినులను దాత రాయంకుల రామారావు, ఎస్ఎంసీ సభ్యులు ఉపాధ్యాయులు అభినందించారు.



అభిలాష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం